

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వెంకటయ్య

నెల్లూరు (హరనాథపురం) : ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వై.వెంకటయ్యను నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఈడీగా డిప్యూటేషన్‌పై ఉన్న కే.రమేష్ మాతృశాఖకు వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటయ్యను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ ఈడీగా పనిచేస్తున్న వెంకటయ్యకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా సెల్వి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆమెను ఆ కార్పొరేషన్ ఈడీ ఆ శాఖకు సరెండర్ చేశారు.


నత్తకే నవ్వొస్తోంది!

మందగమనంలో నాడు-నేడు పనులు
వేధిస్తున్న నిధుల సమస్య.. ఆగిన బిల్లులు

నాడు-నేడు రెండో దశ కింద పాఠశాలల్లో జరుగుతున్న పనులను చూసి నత్తకే నవ్వు వస్తోంది. రోజుల తరబడి పనులు సా....గుతూనే ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో అత్యధిక పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇసుక, సిమెంట్‌కు కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే గతేడాది నుంచి రివాల్వింగ్ ఫండ్ కింద సొమ్ము జమ కాకపోవడంతో పాఠశాలల కమిటీలు తాత్కాలికంగా పనులు నిలిపివేశాయి. అయితే, అధికారులు మాత్రం నాడు-నేడు పనుల్లో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.



బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో నిధులు లేక పునాదుల దశలోనే ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం





ఉదయగిరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులు



కావలి రూరల్ : కొత్తపల్లి హైస్కూల్లో సిమెంట్ అందక ఆగిన అదనపు గదుల నిర్మాణం

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు (విద్య) : నాడు-నేడు రెండో దశ కింద జిల్లాలో 1,357 పాఠశాలలు, 22 జూనియర్ కళాశాలల్లో నిర్మాణాలకు రూ.479 కోట్ల రూ.74లక్షల, 79వేలతో అంచనాలను సిద్ధం చేశారు. అలాగే 553 పాఠశాలల్లో 2వేల అదనపు గదుల నిర్మాణాలకు కూడా పనులను ప్రారంభించారు. ఇందుకుగాను ప్రతి పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాలకు 15 శాతం వంతున రివాల్వింగ్ ఫండ్ జమచేశారు. దీనికి తోడు సిమెంట్, ఇసుక, ఇనుముతోపాటు పలు రకాల నిర్మాణ సామగ్రి అందచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి గత ఏడాది జూన్ నుంచి పనులు ప్రారంభించారు. తొలుత కమిటీల ఖాతాల్లో నగదు పడటంతో పనులు వేగవంతంగా చేసినా తరువాత నిధుల కొరతతో మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో రూ.81కోట్ల 43లక్షల 68 వేలు ఖర్చు చేశారు. మరో ఏడు కోట్ల వరకు రివాల్వింగ్ ఫండ్‌ను పాఠశాలల కమిటీల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. అలాగే సిమెంట్ కొనుగోలుకు రూ.8కోట్ల రూ.44లక్షల 5వేలు, ఇసుకకు రూ.21లక్షల 46వేలు ఖర్చుచేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, చేసిన పనులకు బకాయిలు చెల్లించకపోవడంతో సిమెంట్ సంస్థలు సరఫరా నిలిపివేసినట్లు కమిటీ సభ్యులు చెబుతున్నారు. కొన్ని చోట్ల అదనపు గదులకు శ్లాబ్‌లు వేయగా మరికొన్ని చోట్ల పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. అలాగే ఇంకొన్ని పాఠశాలల్లో ఇంజనీర్లు, పాఠశాల కమిటీల మధ్య సమన్వయం లేకపోవడంతో అవసరానికి మించి మెటీరియల్స్ కొనుగోలు చేయడం, మరికొన్ని చోట్ల కొనుగోలు చేయకపోవడం వంటి సమస్యలతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అధికారులు మాత్రం తమకు విడుదలైన నిధులన్నీ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని, పనులు ఎక్కడా ఆగడం లేదని చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉండటంతో ఆగిపోయిన భవన నిర్మాణాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

● వేధిస్తున్న గదుల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రాథమిక బడుల నుంచి విద్యార్థులు వెళ్లడంతో ఉన్నత పాఠశాలల్లో చాలాచోట్ల తరగతి గదుల సమస్యలు ఏర్పడ్డాయి. దీనికి తోడు గదుల నిర్మాణానికి స్థలం, ఇతరత్రా సమస్యలతో కొన్నిచోట్ల పాతభవనాలను కూల్చివేశారు. ఇలాంటి ప్రాంతాల్లో విద్యార్థులు వరండాల్లోనే కూర్చునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పాఠశాలల పరిసరాలన్నీ ఇసుక, ఇటుకలు, నిర్మాణ పనుల సామాన్లతో అస్తవ్యస్థంగా తయారయ్యాయి. అత్యధిక పాఠశాలల్లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం, మెటీరియల్స్ సరఫరా సరిగా లేకపోవడం, కమిటీలు, ఇంజనీర్ల నడుమ సమన్వయం కుదరకపోవడంతో జిల్లాలో నాడు-నేడు పనులకు గ్రహణం పట్టిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని ప్రకటించినా వచ్చే ఏడాదికి కూడా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని తల్లిదండ్రుల కమిటీలు చెబుతున్నాయి. ఇసుక సరఫరాకు మండలాల్లో డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పాఠశాల నుంచి 10-15 కి.మీల దూరంలో ఉన్నాయి. అక్కడ నుంచి పాఠశాలకు తరలించేందుకు స్థానికంగా ట్రాక్టర్‌లు ఏర్పాటు చేసుకోవడం అదనపు వ్యయంగా మారుతోంది. దీంతో తల్లిదండ్రుల కమిటీలు, హెచ్‌ఎంలకు తలనొప్పిగా మారింది. కొన్ని పాఠశాలల్లో డబ్బులు ఖర్చుచేసినా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. గురువారం పాఠశాలలు తెరుచుకున్న తరుణంలో వసతుల కల్పనపై యంత్రాంగం దృష్టి సారించాలని తల్లిదండ్రులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



కావలి రూరల్ : కొత్తపల్లి హైస్కూల్లో అసంపూర్తిగా వంటగది



సంగంలో అరకొరగానే..

2021-22లో నాడు- నేడు రెండో విడత కింద సంగం ఉన్నత పాఠశాలలో 5 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. ఒక్కో గది నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున రూ.60 లక్షలు కేటాయించారు. తొలివిడతగా మంజూరైన నిధులతో పిల్లర్స్, గోడల వరకు నిర్మించారు. ఆ తర్వాత నిధులు రాక పనులు ఆగిపోయాయి. ఇటీవల వేసవిలో మరి కొంత నిధులు మంజూరవడంతో శ్లాబులు వేశారు. ఆ తర్వాత నిధుల ఊసేలేదు. ఇంకా గోడలకు పూత, దర్వాజాలు, కిటికీలు, తలుపులు, కరెంటు వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 525 మంది బాలబాలికలు ఉండగా, గదులు చాలక వరండాలు, చెట్ల కింద కూర్చోబెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

- సంగం



మర్రిపాడు : పొంగూరు హైస్కూల్‌లో బేస్‌మెంట్‌ను దాటని పనులు

పిల్లర్ల దశలోనే..



మండల కేంద్రమైన వలేటివారిపాలెం హైస్కూల్లో 425 మంది విద్యార్థులు ఉండగా, ఇక్కడే ఇంటర్ కళాశాల కూడా నడుస్తోంది. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేవు. గదులు లేక షెడ్లలోనూ చెట్ల కింద, వరండాలో కూర్చొని పిల్లలు చదువుకుంటున్నారు. నాడు-నేడు పథకం కింద 4 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.92 లక్షలు మంజూరు చేశారు. పిల్లర్ల దశ వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. దీంతో నిధులు కూడా వెనక్కుపోయాయి.

- వలేటివారిపాలెం



నిధులు అందక..

మనుబోలు మండలం మడమనూరు ఉన్నత పాఠశాలలో ఆరు అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, పాత గదులకు మరమ్మతులు, ఇతరత్రా పనులకు రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.63 లక్షలు బిల్లుల రూపంలో, రూ.32లక్షలు సీపీఎం మెటీరియల్ రూపంలో చెల్లించారు. ఇంకా రూ.39లక్షలు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ పాఠశాలలో సుమారుగా 400 నుంచి 500 మంది పిల్లలు చదువుతున్నారు. గదులు చాలక 6, 7 తరగతుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మనుబోలు

విజయోత్సవ ర్యాలీలో టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

- కర్రలు, రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- డీజే ట్రాక్టర్‌ను దహనం చేసిన వైసీపీ వర్గం
- తూర్పుపూండ్లలో పోలీసుల తిష్ఠ
- పోలీస్ అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం



దగ్ధమైన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి


సైదాపురం, జూన్ 13 : మండల పరిధిలోని తూర్పుపూండ్ల గ్రామంలో బుధవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విజయోత్సవ ర్యాలీలో టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడం, వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించిన సందర్భంగా బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో టీడీపీ వర్గం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. డిజే పాటలతో బయలుదేరిన ట్రాక్టర్‌కు వైసీపీ వర్గం దారి ఇవ్వలేదు. దీంతో మాటమాట పెరిగి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో ఘర్షణకు దిగాయి. గ్రామ ఎస్టీకాలనీ సమీపంలో వైసీపీ వర్గీయులు రూ.25లక్షలు విలువజేసే డీజే ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అలాగే, జనరేటర్ ఉన్న వాహన అద్దాలనూ ధ్వంసం చేశారు. ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన ముగ్గురు, వైసీపీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

● ఇరువర్గాలపై కేసుల నమోదు



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలో టీడీపీకి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు, వైసీపీకి చెందిన ప్రకాష్ నాయుడు వర్గాల మధ్య కర్రలు, రాళ్లతో దాడి జరిగిందని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గాయపడ్డవారిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు తెలిపారు. రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం, సైదాపురం, రాపూరు, కండలేరు ఎస్‌ఐలు విజయ్‌కుమార్, మాల్యాద్రి, కిషోర్‌బాబులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, గురువారం ఉదయం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గ్రామానికి చేరుకుని విచారించారు. తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.



ఐదు సంతకాలు.. హర్షాతిరేకాలు!

- పింఛన్ల పెంపుతో 3,19,961 మందికి లబ్ధి
- నిరుద్యోగుల్లో మెగా డీఎస్సీ పండుగ
- మున్సిపాలిటీల్లో మళ్లీ అన్నా క్యాంటీన్లు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుతో ఊరట
- యువతకు ఉపాధి అవకాశాల కల్పన

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవ్వాతాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేయడం ద్వారా ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఊరట కల్పించారు. నిరుపేదలు, కష్టజీవుల కడుపారా భోజనం పెట్టే అన్నా క్యాంటీన్లకు శ్రీకారం చుట్టారు. రైతులను భయపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేశారు. నైపుణ్య గణన ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు నడుం బిగించారు. ముఖ్యమంత్రి హోదాలో గురువారం రాష్ట్ర సచివాలయంలోకి అడుగుపెట్టిన చంద్రబాబు సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన ఐదు కీలక ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. జిల్లాకు చెందిన వృద్ధులు, యువకులు, పేదలు, రైతుల్లో ఆనందాన్ని నింపారు.

● ఇక పింఛను రూ.4 వేలు

వృద్ధాప్య, వింతంతు, చేనేత తదితర పింఛన్లను రూ 4వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అంతేగాక ఏప్రిల్ నుంచే ఈ కొత్త పింఛను అమలు చేసి, 3 నెలలకు రూ.3వేలు జూలై మాసంలో పింఛను 4వేలు మొత్తం రూ.7వేలు ఇవ్వనున్నారు. జిల్లాలో 3,19,961 మంది పింఛనుదారులు ఉండగా, ప్రస్తుతం నెలకు రూ.95.77 కోట్లు చేస్తుండగా, జూలై నుంచి ఈ మొత్తం రూ.125 కోట్లు దాటనుంది.

● నిరుద్యోగుల్లో పండుగ

మెగా డీఎస్సీపై చంద్రబాబు సంతకం చేయడంతో బీఈడీ, డీయడ్ చదువుకున్న నిరుద్యోగుల ఐదేళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 16వేల పైచిలుకు టీచర్ పోస్టులు భర్తీ కానుండగా, జిల్లా కోటా కింద సుమారు వెయ్యికిపైగా పోస్టులు మంజూరు అవుతాయని అంచనా. జిల్లాలో ప్రస్తుతం 550 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇక పాఠశాలల విలీనం కారణంగా జిల్లా పరిధిలో 1500 పోస్టులు రద్దయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం పాఠశాలలను యధాతథంగా కొనసాగిస్తే రద్దయిన ఆ పోస్టులు తిరిగి వస్తాయి. జిల్లాలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సుమారుగా 20వేల మందికిపైగా ఉన్నారు. చంద్రబాబు తీసుకున్న మెగా డీఎస్సీ నిర్ణయం వీరందరిలో పండుగ వాతావరణం తీసుకొచ్చింది.

● మళ్లీ కడుపు నిండుగా అన్నం



పేదలకు ఒకపూట పట్టెడన్నం పెట్టాలన్న విశాల దృక్పథంతో స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. కేవలం 10 రూపాయలకే కడుపు నిండా భోజనం పెట్టే కార్యక్రమాన్ని అమలు చేసింది. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని మూసివేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైలుపై సంతకం చేయడం ద్వారా అటు పేదలపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. గతంలో నెల్లూరు లో ఐదు అన్నా క్యాంటీన్లు, ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున నడిచేవి. వీటికి మళ్లీ పూర్వవైభవం రానుంది.

● అన్నదాతల భయానికి చెక్

రైతులను భయపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు రద్దు చేశారు. భూమి హక్కుపై రకరకాల భయాలు, అనుమానాలను కల్పించే విధంగా జగన్‌ఈ యాక్టును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత రావడం, ఈ చట్టాన్ని రద్దు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు దీనిని రద్దు చేస్తూ గురువారం సంతకం చేశారు.

● నైపుణ్య గణనతో ఉపాధి అవకాశాలు

జనాభాలో 60 శాతం యువత ఉన్నా వీరి చదువు, నైపుణ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో అందరికీ ఉపాధి అవకాశాలను కల్పించలేకుండా పోతున్నారు. దీనిని అధిగమించడానికి చంద్రబాబు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేసినట్లు చదువుకున్న నిరుద్యోగ యువత నైపుణ్య గణన చేయనున్నారు. దీనిని బట్టి రాష్ట్రంలో ఏ రంగానికి చెందిన నైపుణ్యం కలిగిన వారు ఎంత మంది ఉన్నారు, వీరికి ఉపాధి అవకాశాలు లభించాలంటే ఎలాంటి పరిశ్రమలు తీసుకురావాలి, ఎలాంటి శిక్షణ ఇస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువ లభిస్తాయి, ఎలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలనే విషయాలను ఈ గణన ద్వారా అధ్యయనం చేసి తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

నెల్లూరు (విద్య), జూన్ 13 : సుదీర్ఘ విరామం తర్వాత గురువారం పాఠశాలల తలుపులు తెరుచుకున్నాయి. వేసవిలో ఆటపాటలతో ఎంజాయ్ చేసిన విద్యార్థులు ఉదయాన్నే బడి బాట పట్టారు. అయితే, తొలిరోజు తరగతులు నామమాత్రంగా కొనసాగాయి. చాలాచోట్ల విద్యార్థులు, సిబ్బంది పాఠశాలలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. చిందరవందరగా ఉన్న సామగ్రిని సర్ది పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేందుకు శ్రమించారు. కాగా, తొలిరోజే పాఠ్యపుస్తకాలు, విద్యాకానుకలు అందచేస్తామన్న అధికారులు కొంతమందికి మాత్రం నామమాత్రంగా అందచేశారు. విద్యాశాఖ నుంచి పూర్తిస్థాయిలో షెడ్యూల్ అందిన తరువాత కార్యక్రమాలన్నీ చేపడతామని అధికారులు వెల్లడించారు. కాగా, జిల్లాలో 3,432 పాఠశాలల్లో మొత్తం 3,54,779 మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు 60 శాతం మందే హాజరయ్యారు. అలాగే వెళ్లిన పిల్లలకు మధ్యాహ్నం భోజనం అరకొరగానే అందింది. చాలామంది పిల్లలు ఇళ్ల నుంచి క్యారియర్ తెచ్చుకోగా, భోజనం అమలు చేయకపోవడంతో మిగిలిన పిల్లలు ఇంటిబాట పట్టారు.

● 'ప్రైవేట్'లో హడావుడి

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తొలిరోజు అడ్మిషన్ల హడావుడి కనిపించింది. తమకు నచ్చిన పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఫీజులు చెల్లిస్తూ, పుస్తకాలు కొనుగోలు చేస్తూ కనిపించారు. తరగతులు మారుతుండటంతో నూతన గదుల్లో విద్యార్థులంతా వేసవిలో గడిపిన విశేషాలు, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పాఠశాలకు తొలిసారి వెళ్లే బాలలు మారాం చేస్తూ కనిపించారు.



నిలబడేందుకు చోటేది!?



బస్ షెల్టర్‌లో అంబులెన్స్, శవపేటిక



బస్ షెల్టర్.. అంబులెన్స్‌లకా!?

నెల్లూరు నగరంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు అంబులెన్స్‌లకు నిలయాలుగా మారిపోయాయి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట ప్రజల కోసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. అయితే, అవి అంబులెన్స్ నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అడ్డదిడ్డంగా అంబులెన్స్‌లను పార్కింగ్ చేయడంతోపాటు, శవపేటికలను ఉంచడంతో అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. దీంతో రోడ్డుపైనే బస్సులు ఆపి ఎక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబులెన్స్‌లకు పార్కింగ్ సౌకర్యం కల్పించి, బస్ షెల్టర్లను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సర్వర్ పని చేయదు

సాఫ్ట్‌వేర్ సహకరించదు!

- రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- 2.0 విధానంతో ఈసీలకూ ఇబ్బందులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 : జిల్లాలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు, ఈసీ(ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) జారీకి తీవ్ర విఘాతం కలుగుతోంది. రిజిస్ట్రేషన్ శాఖలో సాఫ్ట్‌వేర్, సర్వర్ సమస్య తీవ్రంగా ఉండటంతో రెండు నెలల నుంచి ఆయా పనులు సక్రమంగా సాగడం లేదు. దీంతో సంబంధిత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సాధారణంగా ఈసీలు పరిశీలించి ఆస్తికి సంబంధించిన అన్ని వివరాలు బాగుంటేనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. కానీ ఈసీలే రాకపోవడం, ఒకవేళ వచ్చినా అందులో పూర్తి వివరాలు లేకపోవడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడుతోంది. గతప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈసీల జారీకి కూడా అదే సాఫ్ట్‌వేర్‌ను కొనసాగించడంతో సమస్య మరీ తీవ్ర తరమైంది. ప్రైమ్ 2.0లో ఈసీల కోసం ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించారు. అంతకుముందు ఉన్న 1.0 పద్ధతిలోని ఫార్మాట్‌లో డాక్యుమెంటు నంబరు నమోదు చేయగానే ఈసీలు వచ్చేవి. 2.0 సాఫ్ట్‌వేర్‌కు మారిన తర్వాత ఈసీలు పొందడం జటిలంగా మారింది.



ఆదాయానికి గండి...

సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. ఈ నేపథ్యంలో భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరుగు తున్నాయి. అయితే కార్యాలయంలో సక్రమంగా రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో జిల్లాలోని స్టాంపులు-రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. రోజుకు రూ. కోటికిపైగా ఆదాయం రావలసి ఉండగా, రెండు నెలలుగా సర్వర్, సాఫ్ట్‌వేర్ సమస్యలతో ఆ స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సమస్యను పరిష్కరిస్తున్నాం



సర్వర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పరిష్కరిస్తాం. రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయాన్ని పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

మీసేవ సర్వీసులకు అంతరాయం

- వారం రోజులుగా సర్టిఫికెట్స్ అడంగల్, 1బీ కోసం ఇబ్బందులు



కలిగిరి, జూన్ 13: రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి మీసేవ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, 1బి, అడంగల్ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ఫలితాల లెక్కింపు అనంతరం మీసేవ, సచివాలయాల్లో ఒక్కసారిగా సర్వీసులు ఆగిపోవడంతో ప్రజలు కార్యాలయాలచుట్టూ తిరుగుతున్నారు. వేసవి సెలవులు పూర్తై విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల కోసం కులం, ఆదాయం, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు అవసరం. వాటి కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అదేవిధంగా రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు లేదా బంగారు రుణాలు పొందాలన్నా 1బీ, అడంగల్ కాపీలు తప్పనిసరి. వారంరోజులుగా ఎటువంటి సమాచారం లేకుండా మీసేవ సర్వీసులు పూర్తిగా ఆగిపోవడంతో విద్యార్థులు, రైతులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా పంట రుణాల రెన్యువల్‌కు సంబంధించి గడువు ముగిసేలోపు బ్యాంకుల్లో అడంగల్ కాపీలు సమర్పించకపోతే అదనంగా వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి కూడా వారం రోజుల నుంచి మీసేవ కేంద్రాల వద్దకు నిత్యం తిరుగుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మీసేవ సర్వీసులను పునరుద్ధరించి విద్యార్థులకు, రైతులకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సోమశిలలో 8.498 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, జూన్ 13: సోమశిల జలాశయంకు ఎగువ నుంచి గురువారం 2094 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతుంది.

16న ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూన్ 13 : జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-10, 13, 15 విభాగాల్లో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు రావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు విజయవాడ శాతవాహన కళాశాలలో ఈనెల 22 నుంచి 24వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి బాల, బాలికల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9441955334 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏఏబీ చైర్మన్ రాజీనామా

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 13 : నెల్లూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి(ఏఏబీ) చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీనామాను ఆమోదించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిని లేఖ ద్వారా కోరారు.

బిట్రగుంట రైల్వే రిజర్వేషన్ కౌంటరు

ప్రైవేటీకరణ వద్దు

బిట్రగుంట, జూన్ 13: ఇండియన్ రైల్వేలోనే పేరుగాంచిన బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో టిక్కెట్లు, రిజర్వేషన్ కౌంటర్లను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు చేపట్టడం తగదని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ నూరుద్దీన్ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ చేసినట్లైతే ఇటీవల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన నూతన బిట్రగుంట రైల్వేస్టేషన్ నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందన్నారు. రైల్వే ఉన్నత అధికారులు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెతుకు రాజేశ్వరి, బత్తుల రవిచంద్ర, బొంతా సుధీర్, దాసరి సునీల్, వ్యాపారులు శంకర్‌నాయుడు, పుల్లయ్య, సురేష్, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

సంగం బ్యారేజ్ పెండింగ్ పనుల పరిశీలన



బ్యారేజ్ పెండింగ్ పనులను పరిశీలిస్తున్న తెలుగుగంగ అధికారులు

సంగం, జూన్ 13: సంగం బ్యారేజ్ పెండింగ్ పనులకు గురువారం తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ పరిశీలించారు. రూ. 350 కోట్లతో చేపట్టిన సంగం బ్యారేజ్‌ను 2022 సెప్టెంబరు 5న పనులు పూర్తికాకుండానే ప్రారంభించారు. బ్యారేజ్ ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇంకా దువ్వూరు కాలువ, కనిగిరి ప్రధాన లైనింగ్, నెల్లూరు చెరువు కాలువ, కనుపూరు కాలువ లైనింగ్, ఇతర పనులు పెండింగ్ ఉన్నాయని, ఏజెన్సీకి మెయింటెన్స్ గడువు ముగిసేలోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే చేసిన పనులకు రూ. 50 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, అవి విడుదలైతేగానీ పనులు పూర్తి చేయలేమని కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ రమణారెడ్డి, ఈఈ, డీఈలు, ఏఈలు, బ్యారేజ్ నిర్మాణ మేనేజర్ ఆనందరావు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- డీఈవోకి టీఎన్‌యూఎస్ వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు గురువారం డీఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. జీ.ఓ 117 రద్దుచేయాలని, ఖాళీగా వున్న హెచ్‌ఎం పోస్టులు, స్కూలు అసిస్టెంటు పోస్టుల భర్తీచేసి, ఉన్నత పాఠశాలల్లో పనివేళలు కూడా మార్పుచేయడంతోపాటు పలు సమస్యలను డీఈఓకి విన్నవించినట్లు తెలిపారు. ముందుగా వారు 2024-25 విద్యా సంవత్సరానికి డీఈఓకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి కర్నాటి ప్రసాద్, బాలు తదితరులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13: బుచ్చి నగర పంచాయతీలోని కట్టుబడిపాళెంలో జగనన్న లేఔట్-1లో వున్న ఓ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం గురువారం వెలుగు చూసింది. ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసం బుధవారం అర్థరాత్రి జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

కేన్సర్ నివారణకు ముందస్తు పరీక్షలు అవసరం

- వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూన్ 13 : కేన్సర్ వ్యాధి నివారణకు ముందస్తు పరీక్షలు అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య తెలియచేశారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. నెలరోజులు సాగే ఈ శిక్షణలో కేన్సర్ వ్యాధి నివారణపై పలు కీలక విషయాలు తెలియజేస్తారన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్ వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్సలు అందించే వీలుందని చెప్పారు. ఎన్‌సీడీ గుర్తించిన కేన్సర్ లక్షణాలు ఉన్న వ్యక్తులకు చికిత్సలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌విష్ణు, వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశువైద్య సర్వీస్ అసోసియేషన్ ఏకగ్రీవం



జిల్లా పశువైద్యుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 13 : నెల్లూరు జిల్లా పశువైద్యుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకుల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా చంద్ర కృష్ణమోహన్, ట్రెజరర్‌గా రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా జయపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాయక్, సుప్రజ, మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పశు సంవర్థకశాఖ జేడీ మహేశ్వరుడు, డీడీలు సోమయ్య, కోటేశ్వరరావు, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ చైతన్యకిషోర్, డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు ఎన్నికైన వారిని అభినందించారు. ఎన్నికల పరిశీలకుడిగా రఘునాథబాబు వ్యవహరించారు.

శంకరనగరంలో 144 సెక్షన్



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ ఆరీఫ్

అనంతసాగరం, జూన్ 13: మండలంలోని శంకరనగరం గ్రామాన్ని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గురువారం సందర్శించారు. బుధవారం రాత్రి జరిగిన విజయోత్సవ ర్యాలీలో వైసీపీ నాయకులు టీడీపీ వర్గంపై మూకుమ్మడిగా దాడి చేయగా ఏడుగురు గాయపడ్డారు. దీంతో ఎస్పీ గురువారం గ్రామానికి చేరుకుని విచారించారు. ఈ ఘటనలో ఇప్పటికి 10 మందిని అరెస్టు చేశామని, మిగతా వారి గురించి కూడా ఆరా తీస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా సాగరం ఇన్‌చార్జ్ తహసీల్దారు గోపికృష్ణ, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ వేణులకు పలు సూచనలు చేశారు. 144 సెక్షన్ అమలు పరచాలని ఆదేశించారు. ఎస్పీ వెంట అనంతసాగరం, ఆత్మకూరు ఎస్ఐలు సూర్యప్రకాష్‌రెడ్డి, ముత్యాలరావు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో యువతి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13: రోడ్డుప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని దామరమడుగు పరిధిలోని ఆర్‌ఆర్ నగర్(మతంకాలనీ)వద్ద జాతీయ రహదారిపై జరిగింది. కడప జిల్లా చాపాడు మండలం పెద్ద చిగురుపాడు గ్రామానికి చెందిన భార్యాభర్తలు కృష్ణమోహన్‌రెడ్డి, సుమతి (32) ఆగ్రామం నుంచి నెల్లూరుకు బైక్‌లో వెళ్తుండగా ఆర్‌ఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సుమతి తీవ్ర గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందగా, భర్తకు ప్రమాదం తప్పింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మేకను రక్షించబోయి..

ఉదయగిరి, జూన్ 13: మండలంలోని శకునాలపల్లిలో వ్యవసాయ బావిలో పడిన మేకను రక్షించబోయి యజమాని మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈర్ల వెంకటయ్య(75) తనకు ఉన్న మేకలు, గొర్రెలను బుధవారం మేత కోసం అడవికి తోలుకొని వెళ్లాడు. ఆ క్రమంలో ఓ వ్యవ సాయ బావిలో మేక పడి పోయింది. దానిని రక్షించేందుకు బావిలోకి దిగిన వెంకటయ్య కాళ్లకు తామర తుట్టెలు చుట్టుకోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లిన భార్యకు వెంకటయ్య కనిపించకపోవడంతో విషయాన్ని బంధువులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి గురువారం ఉదయం గాలింపుల్లో భాగంగా ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, చేతికర్ర, మంచినీటి బాటిల్ కనిపించడంతో బావిలోకి దిగి చూడగా మేక, వెంకటయ్య మృతదేహాలు లభించాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	276
స్కిన్‌లెస్	306
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6810
వెండి కిలో ధర	రూ. 90,500
వెండి ఒక గ్రాము	రూ. 92.50

భూసార పరీక్షలతోనే రైతులకు రక్ష

- జిల్లాకు 23,300 మట్టి పరీక్షల లక్ష్యం



నెల్లూరు (వ్యవసాయం), జూన్ 13 : పంటలు బాగా పండి అధిక దిగుబడులు రావాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. పొలంలో పంటలు సాగు చేసే క్రమంలో చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు, మొక్క ఏపుగా పెరిగేందుకు రకరకాల రసాయనిక ఎరువులను రైతులు వినియోగిస్తారు. దీనివల్ల మట్టిలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. ఏ పోషకాలు క్షీణించి ఏమేమి లోపాలు లోపించాయనే వివిధ అంశాలు భూసార పరీక్షల ద్వారానే తెలుస్తాయి. దీని ఆధారంగానే భూమిలో ఏయే పంటలు వేసుకోవాలో నిర్ణయానికి రావొచ్చు. అంతేగాక ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను తెలుసుకోవచ్చు. ఇంతటి కీలకమైన పరీక్షలు గత నాలుగేళ్లుగా నామమాత్రంగానే జరిగాయి. దీంతో భూమిలో పోషకాలకు సంబంధించి రైతులకు సరైన సమాచారం ఉండటం లేదు. ఈ ప్రభావం దిగుబడులపై పడుతోంది.

23,300 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం

పంటల సాగుకు ముందు భూసారం పరిస్థితి తెలుసుకోవడం ముఖ్యం. ఈ క్రమంలో జిల్లాలో 23300 మట్టి నమూనాలు సేకరించాలని తాజాగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. సబ్ డివిజన్ల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ఉదయగిరి సబ్ డివిజన్‌కు 926, వింజమూరు 2165, కావలి 4381, ఆత్మకూరు 1944, నెల్లూరు 2360, ఇందుకూరుపేట 1956, పొదలకూరు 2983, కందుకూరు 2260 మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలను కేటాయించినట్లు తెలిపారు.

ఫలితాలకు అనుగుణంగా ఎరువులు

రసాయనిక ఎరువుల వాడకం పెరగడంతో భూమి భౌతికస్థితిలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. అధికంగా యూరియా వాడ కం వల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థి తుల నుంచి బయట పడాలంటే భూసార పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వాటి ఫలితాలకు అను గుణంగా ఎరువులు చల్లుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. భూమిలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుంటే మంచి దిగుబడులు ఇచ్చే పంటలు సాగు చేసుకోవచ్చు. అంతేగాక సాగుచేసే పంటలకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చు.

ఉలవపాడులో పడకేసిన పారిశుధ్యం

- చెత్తకుప్పలతో నిండిన వీధులు
- గ్రామస్థుల అవస్థలు



ఎస్సీ, బీసీ కాలనీల రోడ్డు పక్కన చెత్తలో పందుల సంచారం

ఉలవపాడు, జూన్ 13: ఉలవపాడు మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఏరోడ్డు చూసినా చెత్తకుప్పలతో దర్శనమిస్తోంది. గ్రామంలో రిజర్వుకాలనీ, హైస్కూల్ సమీపం, ఎస్సీ, బీసీ వడ్డెర కాలనీ మధ్య ప్రధాన రోడ్డున నడవాలంటే ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంబేడ్కర్ నగర్‌లో ప్రధాన రహదారి వెంట చెత్తకుప్పలు పేరుకుపోయాయి. బీసీ వడ్డెర పాలెం, ఎస్సీ కాలనీ మధ్య రోడ్డులో నివాసాల వారు చెత్తా చెదారం ప్రధాన రోడ్డు పక్కనే వేస్తుండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల బెడద ఎక్కువైందని వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులు ట్రంక్ రోడ్డు వ్యాపారస్తుల చెత్తతో నిండిపోయాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు తీరినప్పుడు ఒక్కో ప్రాంతానికి వెళ్లి నామమాత్రపు పనులు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా బీసీ, ఎస్సీ కాలనీలలోని బజార్ల కూడళ్లు కూడా చెత్తతో నిండిపోయాయి. నెలలు తరబడి కాలనీలోని వీధులు శుభ్రం చేయరని, చెత్త, పాలిథిన్ కవర్లు గాలికి ఇళ్లలోకి కొట్టుకొస్తున్నా పట్టించుకోవడం లేదని మహిళలు పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మురికి కాలువలు కూడా శుభ్రంచేసి నెలలు గడుస్తోందని, గతంలో కాలువల్లో పూడిక తీసిన చెత్త ఎత్తకుండా అలాగే వదిలేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి సారించి కనీసం వారంలో ఒకసారైనా రోడ్డు పక్కన చెత్తకుప్పలు శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, వారం నుంచి పంచాయతీ పారిశుధ్య కార్మికుల చేత పనిచేయిస్తున్న మేస్త్రీ విధుల నుంచి తప్పుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఘనంగా వెంగమాంబ పల్లకీసేవ



పల్లకీలో వెంగమాంబకు గ్రామోత్సవం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 13: మండలంలోని నర్రవాడలో వెలసి ఉన్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి గురువారం అమ్మవారి పల్లకిసేవ నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ తెలిపారు. అలాగే ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆమె కోరారు.

గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు

వరికుంటపాడు, జూన్ 13: మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్స వాలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చల్లా తిరు పతయ్య తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో గోడపత్రికలు, కరపత్రాలను ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనము, నవగ్రహ మండపారాధన, ఉత్సవ, నవగ్రహ విగ్రహాలకు మహాస్నానము, అభిషేకాలు, మహానివేదన, కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న హోమాలు, గ్రామోత్సవాలు, 30న వాల్మీక, కుంకుమపూజ, పొంగళ్లు నిర్వహించడం జరుగు తుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కార్యనిర్వాహక అధికారి చల్లా యగ్నేశ్వ రరావు, వైస్ చైర్మన్ చల్లా మాల్యాద్రి, అర్చకులు ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

గంగమ్మ, పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

బిట్రగుంట, జూన్ 13: బోగోలు మండలం గంగతిప్పపై వెలసిన గంగమ్మ, పోలేరమ్మల తిరునాళ్ల రెండోరోజు గంగపెట్టి, ఆలయ మైలు తుడుపు (శుద్ధి) కార్యక్రమాల అనంతరం ప్రత్యేక పూజలు గురువారం జరిగాయి. కాగా, శుక్రవారం ఉదయం నాగులచింత వద్ద పుట్టకప్పు, మధ్యాహ్నం ఊర్లమాను, సాయంత్రం పుట్ట బంగారం, రాత్రి అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని గ్రామస్థులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఉదయగిరి, జూన్ 13: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జూన్ 13: మండలంలోని కుర్రపల్లి, శకునాలపల్లి, బోడబండ, పుల్లాయపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి, సంజీవరాజుపల్లి, బిజ్జంపల్లి తదితర పాఠశాలలను ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

కేజీబీవీలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, జూన్ 13: పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ఎస్ఓ స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో ఖాళీలు ఉన్నాయని పూర్తి వివరాలకు 9666092091 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే

ఉదయగిరి, జూన్ 13: వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలవవచ్చని వారు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ సంబరాలు



ఆత్మకూరు : విజయోత్సవ వేడుకల్లో టీడీపీ శ్రేణులు

ఆత్మకూరు, జూన్ 13: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావడం, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపొందడంతో పాటు రాష్ట్రమంత్రి పదవి వరించడంతో ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో టీడీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులనాయుడు, టీడీపీ నాయకులు చెరుకూరు వెంకటేశ్వర్లునాయుడు, చెరుకూరు తిరుపతినాయుడు పాల్గొన్నారు.

అనంతసాగరం: టీడీపీ అధికారంలోకి రావడంతో మండలంలోని సంజీవనగరంలో గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో శాఖమూరి సుబ్బారావు, బోయపాటి శ్రీనివాసచౌదరి, వెంకటయ్య నాయుడు, నరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో గురువారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన సీనియర్ నాయకులు ముత్తంశెట్టి చెన్నకేశవులు, దాసరి వెంకటసుబ్బయ్య, దాసరి విరయ్య, బోగినేని కాశిరత్తయ్య, కోయిలపాడు యూత్, పెద్ద గౌస్ పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు అభినందనల వెల్లువ



ఉదయగిరి: మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల

ఉదయగిరి, జూన్ 13: రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం అమరావతిలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జడ్పీ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు వెంగయ్యయాదవ్ ఉన్నారు.

ఆత్మకూరు: రాష్ట్ర మంతి ఆనం రామ నారాయణరెడ్డిని ఆత్మకూరు ఆర్డీవో మధులత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అనంతసాగరం: సోమశిలకు చెందిన టీడీపీ నాయకులు గురువారం విజయవాడలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమశిల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేగు పెంచలయ్య, గువ్వల పెంచలయ్య, ముక్కు నాగరత్నం, పొంగూరు మురళి, కొప్పాల నరశింహులు, పెంచలయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, జూన్ 13: మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతిచెందిన కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున రూ. 50 వేలు గురువారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ సభ్యులు అందజేశారు. 21వ వార్డు పరిధిలోని కుర్వకల్లి గౌరమ్మ, 16వ వార్డు పరిధిలో సయ్యద్ ఫాతిమాబీ, 4వ వార్డులో జ్యోతి లక్ష్మి, 19వ వార్డులో పుట్టం పుల్లమ్మ, 18వ వార్డులో సయ్యద్ సాహెబ్‌జాదాలకు ట్రస్ట్ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమకు సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

అనంతసాగరం, జూన్ 13: మండలంలోని రేవూరులో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని ఆ గ్రామానికి చెందిన వైసీపీ నేతలు బుధవారం రాత్రి చింపేశారని వారిపై చర్యలు తీసుకోవాలని పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈవిషయంపై అనంతసాగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఎం కేర్ ఆర్థిక సాయం చెక్కుల అందజేత



ఆర్థిక సాయం అందచేస్తున్న అధికారులు

సంగం, జూన్ 13: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో కోవిడ్‌తో మృతి చెందిన తల్లిదండ్రుల ఇద్దరి పిల్లలకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంజూరైన పీఎం కేర్ సాయం చెక్కును గురువారం ఐసీడీఎస్ అధికారులు అందజేశారు. 2021 మే 12వ తేదీన అల్లాడి సాయి, కవిత దంపతులు కోవిడ్‌తో మృతి చెందారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కేర్ చిల్డ్రన్స్ పథకంలో భాగంగా వారి ఇద్దరి పిల్లలైన అల్లాడి లాస్య (16), ప్రజ్వల్ (9)కు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున మంజూరైంది. ఆ మొత్తాన్ని వారి పేర్లపై బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను స్థానిక సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సంరక్షకులకు అధికారులు అందజేశారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరో ఇద్దరికి రూ. 10 లక్షల చొప్పున బాండ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సునీత, సూపర్‌వైజర్‌లు రమాదేవి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణమ్మ, పిల్లల సంరక్షకులు పెంచలయ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కల్యాణ మండపం నిర్మాణం



భూమి పూజ చేస్తున్న కుట్టుబోయిన బ్రహ్మానందం

బిట్రగుంట, జూన్ 13: పేద ప్రజల కోసం షిరిడీ శేషసాయినాథుని సన్నిధిన కల్యాణ మండపం నిర్మిస్తున్నట్లు మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకా నగరులో ఉన్న శేషసాయి మందిర ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణ భూమిపూజ కార్యక్రమాలు గురువారం జరిగాయి. మొదట సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి పూజ, మండపారాధన, సాయిభక్తులచే సమూహిక శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎం రత్నం, మహేంద్ర, వెంకటేశ్వర్లు, చక్రపాణి, తేజ, లక్ష్మీనారాయణ, మేఘనాథ్, రాకేష్, కిరణ్, శేషయ్యస్వామి తదితరులు ఉన్నారు.

రాజధాని రైతులకు సత్కారం



రైతులను సత్కరిస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 13: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయడంలో కీలక పాత్ర పోషించిన రాజధాని రైతులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి సత్కరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజధాని రైతులు దారి పొడవునా ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రాజధాని రైతులను కావ్య క్రిష్ణారెడ్డి సత్కరించి కూటమి అధికారంలోకి రావడంలో వారు చేసిన కృషి, పోరాటాన్ని కొనియాడారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలిగిరి, జూన్ 13: శ్రీ అభయాంజనేయ స్వామి పుష్కరిణి క్షేత్రం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభయాంజనేయునికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

ఉలవపాడు, జూన్ 13: వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని బాధితులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వినతుల స్వీకరణకు మండలం నుంచి 20 మంది వివిధ శాఖలకు సంబంధించి అర్జీలు అందించారు. 13 మంది రెవెన్యూకు చెందిన భూముల ఆన్‌లైన్ సమస్యలు, మిగిలిన అర్జీలు ఇతర శాఖలకు సంబంధించినవిగా తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ వలన మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి పనులు పెండింగ్ పడిన బాధితులకు న్యాయం చేసేందుకు కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, వివిధ శాఖల మండలాధికారులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

15న ఎమ్మెల్యేలకు సన్మానం

కందుకూరు, జూన్ 13: యాదవ సంఘం ఆధ్వర్యంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యయాదవ్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులకు శనివారం కందుకూరులో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు వై లక్ష్మీనారాయణ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఉదయం 11.30 గంటలకు పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ఆర్కే బిల్డింగ్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీలో తొలగిన తాగునీటి కష్టాలు



తాగునీటికి వేసిన పైప్‌లైన్లు

కావలి రూరల్, జూన్ 13: ఐదేళ్లపాటు తాగునీటి కోసం అలమటించిన ఆముదాలదిన్నె ఎస్టీకాలనీ వాసులు స్థానిక టీడీపీ నేతల ద్వారా తమ సమస్యలు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో వారికి తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. ఆముదాలదిన్నె రోడ్డు నుండి ఎస్టీ కాలనీకి గురువారం యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లు వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే పనులు చేపట్టి తుమ్మలపెంట రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ల ద్వారా తాగునీటి పైప్ లైన్‌లు వేసి సమస్యను పరిష్కరించటం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంక్ ఉద్యోగికి సత్కారం



అసిస్టెంట్ మేనేజర్ సుబ్బారావును సత్కరిస్తున్న మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది

వలేటివారిపాలెం, జూన్ 13 : మండల కేంద్రమైన వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ కందుకూరు స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న సుబ్బారావును స్టేట్‌బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, ఖాతాదారులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఇంటూరి పరామర్శ

- రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం



నరసింహం కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 13: చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జనసైనికుడు ఇనకల్లు నరసింహం కుటుంబ సభ్యులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం రాత్రి పరామర్శించారు. మాచవరంలోని మృతుని నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు శ్రీనివాసులు, అనూరాధలను పరామర్శించి ఓదార్చారు. వారికి 2 లక్షల రూపాయల ఆర్థికసహాయం అందజేసిన నాగేశ్వరావు కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాదినేని మాల్యాద్రి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బడేవారిపాలెం నుండి మాలకొండకు పాదయాత్ర

వలేటివారిపాలెం: కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి బడేవారిపాలెం నుండి మాలకొండ పుణ్యక్షేత్రం వరకూ టీడీపీ కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యకర్తలు బడేవారిపాలెం చేరుకోవాలని మాదాల లక్ష్మీనరసింహం తెలియజేశారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న వారికి సంఘీభావం తెలుపుతున్న నేతలు

లింగసముద్రం, జూన్ 13: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, బాల వీరాంజనేయస్వామి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలను లింగసముద్రంలోని పలువురు టీడీపీ నేతలు కలిసి సంఘీభావం తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన మందాటి బాలకోటయ్య మరో 28 మంది టీడీపీ నేతలు లింగసముద్రం మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్తుండగా మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, టీడీపీ నాయకులు చెంబేటి రమేష్, ప్రభాకర్, మాలకొండరాయుడు తదితరులు వారిని టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి సంఘీభావం తెలిపారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై హర్షం

కావలి, జూన్ 13: రైతులు ఆందోళన చెందుతున్న ఏపీ భూయాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దుచేస్తూ ఎన్నికలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టం వలన వచ్చే ప్రమాదాలపై రైతులు, న్యాయవాదులు, మేధావులు ఎన్నో ఆందోళనలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం అప్పట్లో స్పందించకపోవటం దారుణమన్నారు. అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తాను బాధ్యతలు తీసుకున్న వెంటనే ల్యాండ్ టైటిల్‌యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేయటం రైతులకు శుభపరిమాణమన్నారు. ఈ చట్టం రద్దు కోసం న్యాయవాదులు, మేధావులు, రైతులు చేసిన పోరాటాలకు కావలిలో అండగా నిలిచిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి : సీపీఎం



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

గుడ్లూరు, జూన్ 13: మండల కేంద్రమైన గుడ్లూరు ఎమ్మెస్సార్ కాలనీలో లోవోల్టేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని గుడ్లూరు మండల సీపీఎం నాయకులు విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. గుడ్లూరులో కాలనీల్లో సీపీఎం బృందం గురువారం పర్యటించారు. ఎమ్మెస్సార్ కాలనీలో లోవోల్టేజీ కారణంగా కనీసం ఫ్యాన్‌కూడా తిరగకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సిన పరిస్థితి ఉందని కాలనీవాసులు సీపీఎం బృందానికి విన్నవించుకున్నారు. గతంలో సీపీఎం పోరాట ఫలితంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు అయినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయపోవడంతో తరచుగా ఈ సమస్య తలెత్తుతోందని, మరో పక్క వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడంలేదని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, కొట్టే వెంకయ్య, స్టాలిన్, గడ్డం రాజేష్, రాపూరి మాల్యాద్రి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచెర్లలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

లింగసముద్రం, జూన్ 13 : మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో బుధవారం టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకొని పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో ఇరువర్గాల మధ్య తిరిగి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీస్ పికెట్‌ను కొనసాగించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారని ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు. గురువారం సాయంత్రం గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు మొగిలిచెర్ల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బాజీబాబు, పోలీసులకు సూచించారు. అయితే గ్రామంలో జరిగిన దాడులకు సంబంధించి పోలీసులు ఇరువర్గాలకు చెందిన కొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

దివ్యాంగుల పాఠశాలకు స్కూల్ వ్యాన్ వితరణ



స్కూల్ వ్యాన్‌ను బహుకరిస్తున్న ఎల్ఐసీ గోల్డెన్‌జూబ్లీ ఫౌండేషన్ ప్రతినిధులు

కందుకూరు, జూన్ 13: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ వ్యాన్ బహుకరించారు. దివ్యాంగుల పాఠశాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులను తీసుకొచ్చేందుకు వీలుగా 18.21 లక్షల రూపాయల విలువజేసే స్కూల్ వ్యాన్‌ను ఫౌండేషన్ ద్వారా కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా గురువారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు బి ప్రసాదరావు, ఎల్ఐసీ మార్కెటింగ్ మేనేజరు ఓ కృష్ణమూర్తి, సీనియర్ బ్రాంచ్ మేనేజరు ఐవీఏ కాంతారావు చేతులమీదుగా పాఠశాల కరస్పాండెంట్ వి సుబ్బారెడ్డికి నూతన వ్యానును స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎల్ఐసీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు స్కూల్‌వ్యాన్ బహుకరించటం హర్షణీయమని కృతజ్ఞతలు తెలిపారు.

ఖాళీ జాగా.. వేసేయ్ పాగా!

● నగర పంచాయతీలో ఆక్రమణదారుల జోరు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13 : నగర పంచాయతీలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమార్కులు పాగా వేసేస్తున్నారు. కబ్జాదారుల ఆగడాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పట్టణవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల బుచ్చి, జొన్నవాడ మార్గంలో చెల్లాయపాళెం సెంట్రల్ చానల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా కాలువ పోరంబోకు భూములను ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టారు. అలాగే అంబేడ్కర్‌నగర్ బైపాస్‌రోడ్డు, రాజుపాళెం రోడ్డు కూడలిలో ఆంజనేయస్వామి గుడి వద్ద నగర పంచాయతీ స్థలంలో కొందరు ఇల్లు నిర్మిస్తుంటే ఫిర్యాదు చేసినా కమిషనర్ విచారించిన పాపాన పోలేదని ప్రజలు అంటున్నారు. అయితే, కమిషనర్ మాత్రం అది కొంత పంచాయతీ స్థలంగా చెబుతూనే సర్వే నెం.1015లో రిజిస్ట్రేషన్ స్థలంగా అంటున్నారు. అయినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయలేదనడం విశేషం. సదరు భూమి వవ్వేరు రెవెన్యూ శాఖలో ఇనాం భూమిగా నమోదైవుండగా, రిజిస్ట్రేషన్ శాఖలో మాత్రం నిషేధిత జాబితాలో లేని భూమిగా ఉండటం గమనార్హం. కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు, కబ్జాదారుల మధ్య లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఇనాం భూమిలో జరుగుతున్న నిర్మాణాలు

ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

● మినగల్లులో దండోరా

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13: మండలంలోని మినగల్లు పెన్నా నది పరీవాహక ప్రాంతం నుంచి తహసీల్దారు అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినా, తరలించినా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారనే హెచ్చరికలతో మినగల్లు గ్రామంలో గురువారం దండోరా వేశారు. తహసీల్దారు, బుచ్చి సీఐ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ అధ్వర్యంలో అందరికీ తెలిసేలా దండోరా వేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 13 : ప్రపంచ పర్యావరణ వారోత్సవాలను ప్రభుత్వ పాఠశాలలో గురువారం నుంచి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ఎం పాఠశాలలో పర్యావరణ కాలుష్యంపై విద్యార్థులతో చర్చ ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ చెట్లను నరికివేయడం, పరిశ్రమల స్థాపన, వాహనాలను ఎక్కువగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతోందన్నారు. దీని నివారణకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌బాబు కూడా పాల్గొన్నారు.

శభాష్ ప్రసాద్ !

● దివ్యాంగ క్రీడాకారుడికి డీఈవో అభినందన



నెల్లూరు (విద్య), జూన్ 13 : క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగ క్రీడాకారుడిని డీఈవో రామారావు అభినందించారు. జిల్లాలోని తోటపల్లిగూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే ప్రసాద్ అనే బధిర విద్యార్థి కడపలోని గండికోటలో ఈనెల 7 నుంచి 11వతేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల అడ్వెంచర్స్ క్రీడల్లో పాల్గొని రాణించాడు. ఈ సందర్భంగా గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారావు ఆ విద్యార్థిని అభినందించారు. అడ్వెంచర్స్ స్పోర్ట్స్‌లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికవడం ప్రశంసనీయమన్నారు. లడక్‌లో జూలైలో జరిగే జాతీయ పర్వతారోహణలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి, కోఆర్డినేటర్ కే పెంచ లయ్య, ప్రధానోపాధ్యాయుడు కే రియాజ్ అహ్మద్, ఉపా ధ్యాయుడు రామచంద్రయ్య పాల్గొన్నారు.

నాగబాబును, నాదెండ్లను కలిసిన సుజయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 13: జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు గురువారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును, పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మోగిన బడి గంట

కోవూరు, జూన్ 13: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలల్ని పునఃప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్ని బుధవారం పునఃప్రారంభించాల్సి ఉండగా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవీ ప్రమాణ స్వీకారం చేసినందువల్ల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కాగా, విద్యార్థులకు అందించాల్సిన యూనిఫారం, కిట్లను మండల విద్యాశాఖ సిద్ధం చేసింది. ఎంఈవో చెంచులక్ష్మమ్మ, సీఆర్ఎంటీలు ఎం శ్రీనివాసులు, విష్ణుప్రసాద్, వనజ, ఉష, హేమలత, వెంకటరమణమ్మ, మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూనిఫారం కిట్లను పంపిణీకి సిద్ధం చేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి : డీఈవో రామారావు


విద్యార్థులకు అందించే కిట్లను పరిశీలిస్తున్న డీఈవో

వెంకటాచలం, జూన్ 13 : రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామారావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రాబోయే విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో వీ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ

మనుబోలు, జూన్ 13: తొలిరోజు బడికి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండలానికి 80శాతం పుస్తకాలు చేరినట్లు విద్యాశాఖాధికారి శేషాద్రివాసు తెలిపారు. ఆయన పుస్తకాల నిల్వ కేంద్రాన్ని పరిశీలించి సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీల ద్వారా ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం : ఇసుకపాళెం సచివాలయం 1లో గురువారం జరిగిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను జిల్లా లెప్రసీ అధికారి ఎస్‌కే.ఖాదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. సెక్రటరీ మల్లికార్జునరెడ్డి, డీపీసీ విజయ్‌కుమార్ ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతిరెడ్డికి అభినందనలు


ప్రశాంతిరెడ్డిని కలిసిన వ్యవసాయశాఖాధికారులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 : కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గురువారం నగరంలోని ఆమె నివాసంలో పలువురు ప్రజలు, నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొడవలూరు మండలం రెడ్డిపాలెం, మానేగుంటపాడు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కోవూరు నియోజకవర్గ వ్యవసాయాధికారులు ప్రశాంతిరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఏడీ సుజాత, ఏవో మేరీ కమల, నాగార్జున తదిత రులు పాల్గొన్నారు. కొడవలూరు మండల పంచాయతీ కార్యదర్శి జీ జాలయ్య ఎమ్మెల్యేను కలిసి పంచయతీరాజ్ శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీ రాధాకృష్ణ, వీ శీనయ్య, ఆర్ శివకుమార్‌రెడ్డి, డీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదూరు సోదరులకు సోమిరెడ్డి పరామర్శ

ముత్తుకూరు, జూన్ 13 : భార్య వియోగం పొందిన సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే ఈదూరు రామకృష్ణారెడ్డి, సోదరుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డిలను గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి భార్య రుక్మిణమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె ఉత్తరక్రియల్లో పాల్గొన్న సోమిరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, పారిశ్రా మికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు పరామర్శించి తమ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మునుకూరకు రవికుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, బొమ్మి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఈదూరు సోదరులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం

ముత్తుకూరు, జూన్ 13 : పర్యావరణ పరిరక్షణ కోసం భూ పునరుద్ధరణ, ఎడారీకరణ లేని ప్రాంతంగా మా భూమి - మన భవిష్యత్తు అనే నినాదంతో అదానీ ఫౌండేషన్, అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ భాగస్వామ్యంతో 14వేల మొక్కలు నాటారు. కృష్ణపట్నం అర్కాటపాలెం గ్రామంతో పాటు ముత్తుకూరు గ్రామ పంచాయతీలోని అదాల్‌నగర్, రామలింగాపురం చలివేంద్రం గ్రామాలు నారికెళ్లపల్లి గ్రామ పంచాయతీలో అదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సలీల్‌శ్రీవాస్తవ, అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ పర్యావరణ ప్రతినిధులు వేణుగోపాల్‌రెడ్డి, హేమ, హేమలత, అముద, గోవిందమ్మ, వనజ, గీతారాణి, సునంద, టి.అరుణ్, షేక్.షాహుల్ హమీద్, డాక్టర్ సి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అదాని ఫౌండేషన్ ప్రతినిధులు

శునకాల స్వైర విహారం

బెంబేలెత్తుతున్న ప్రజలు, వాహన చోదకులు

కొడవలూరు, జూన్ 13 : శునకాల స్వైర విహారంతో ప్రజలు, వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ఒంటరిగా వెళుతున్న వారిపై దాడికి పాల్పడుతున్నాయని, వీటి దాడుల్లో చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా గాయపడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లాలంటే వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. వాహనాలపై వెళ్తున్నవారిని కుక్కలు వెంబడించడంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెలు, కోళ్లపై కుడా కుక్కలు దాడి చేస్తున్నాయని, ఇటీవల బసవాయపాళెం గ్రామంలో వీధి కుక్క బాలుడిని తీవ్రంగా గాయపరిచిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా దామేగుంట పంచాయతీ పరిధిలో చలివేంద్రం గ్రామంలో వేకువజామున వాకింగ్ వెళుతున్న వృద్ధుడిని తీవ్రంగా గాయపరిచాయి. స్థానికుల చొరవతో ఆయన ప్రాణాలతో బయటపడ్డాడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

రక్తమిచ్చి ప్రాణం నిలపండి!

రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి, ప్రసవ సమయంలో గర్భిణులకు, తలసీమియా వంటి వ్యాధులతో బాధపడేవారికి రక్తం ఎంతో అవసరం. కానీ, జిల్లాలో రక్తం కొరత తీవ్రంగా ఉంది. రోగుల అవసరాలకు తగినంతగా రక్తం లభ్యం కావడంలేదు. ప్రతి పది వేల మందిలో 15 మంది రక్తదానం చేయాల్సి ఉండగా ఐదు మంది మాత్రమే రక్తదానం చేస్తుండడంతో రక్తం కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో రక్తదాతల సంఖ్య పెరగాలని, ముఖ్యంగా యువతలో రక్తదానంపై మరింత చైతన్యం రావాలని నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలో రక్తం కొరత
45 వేల మంది రక్తదాతలు
అయినా సరిపోని పరిస్థితి
మరింత చైతన్యం అవసరం

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



నెల్లూరు(వైద్యం), జూన్ 13 : జిల్లాలో రక్త కొరత తీవ్రంగా ఉంది. ఎంతో మంది వ్యాధిగ్రస్తులు రక్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు రక్తదానం చేసేందుకు పెద్దసంఖ్యలో యువత ముందుకు వచ్చేది. ఎక్కువగా రక్తదాన శిబిరాలు ఏర్పాటయ్యేవి. ఫలితంగా రక్తం అవసరాలు కొంత వరకు తీరేవి. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. రక్తదాన శిబిరాలు ఏర్పాటు నామమాత్రంగా మారింది. రెడ్‌క్రాస్ రక్తనిధి కొంత వరకు రోగులకు అవసరమైన రక్తం అందించేందుకు కృషి చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో రక్తం అవసరాలను తీర్చలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. 1905వ సంవత్సరంలో జిల్లాలో స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం ప్రారంభమైంది. ఆ స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలి రక్తదాత జిల్లాలోని వెంకటగిరికి చెందిన వెంకటనరసింహారావు. ప్రస్తుతం జిల్లాలో 45 వేల మందికిపైగా రక్తదాతలు పేర్లు నమోదు చేసుకున్నారు. కొందరు తరచూ రక్తదానం చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా, రక్తగ్రూపుల సృష్టికర్త కార్ల్ ల్యాండ్‌స్టైనర్ పుట్టిన రోజైన జూన్ 14వ తేదీని ఏటా ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటారు.

జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అత్యధికంగా రక్తాన్ని సేకరిస్తోంది. గతంలో ఈ బ్లడ్ బ్యాంకు నుంచి రోజుకు 100 యూనిట్లపైగా రోగులకు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం 20 నుంచి 30 యూనిట్లు అందించటమూ కష్టంగా మారుతోంది. నోవా బ్లడ్ బ్యాంక్, నెల్లూరు బ్లడ్‌బ్యాంక్, విజయ బ్లడ్‌బ్యాంక్, జీజీహెచ్‌లోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్, నారాయణ ఆసుపత్రిలోని రక్తనిధి వంటివి కూడా రక్తం సేకరణ, సరఫరా సేవలు అందిస్తున్నా పూర్తిస్థాయిలో రక్తం అవసరాలు తీరడం లేదు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా ఆసుపత్రుల్లోని బ్లడ్ బ్యాంక్‌లు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తాన్ని అందిస్తున్నాయి.

రక్తదాన శిబిరాలకు కృషి



నగరంతోపాటు రూరల్లోనూ పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు స్వయంగా 59 సార్లు రక్తదానం చేశాను. రక్తదాతలను ప్రోత్సహించేందుకు యువతలో ఉద్యమ స్ఫూర్తిని నింపేందుకు కృషి చేస్తున్నాము.

- విజయభాస్కర్, రక్తదాత, మోటివేటర్

133 సార్లు రక్తదానం చేశా



రక్తదాత, మోటివేటర్ సుకుమార్‌రెడ్డి, నెల్లూరు ఆసుపత్రి నిర్వాహకుడు దివంగత డాక్టర్ విజయకుమార్ స్ఫూర్తితో 1985లో రక్తదానం మొదలు పెట్టాను. ఇప్పటి వరకు 133 సార్లు రక్తదానం చేశాను. ఎందరినో దాతలుగా మార్చాను. ఇంకా రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

- మధుసూదన్, రక్తదాత, మోటివేటర్

ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి



జిల్లాలో రక్తం అవసరాలను తీర్చేందుకు ప్రతి ఒక్కరిలో చైతన్యం అవసరం. రక్తదాతల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాము. నేను 1986 నుంచి ఇప్పటి వరకు 98 సార్లు రక్తదానం చేశాను. ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాము. రక్తదానంపై చాలా మందిలో అపోహలు ఉన్నాయి. వాటిని విడనాడాలి.

- అజయ్‌బాబు, రక్తదాత, రక్తనిధి కన్వీనర్

దేవ దేవుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలి

● సీఎం చంద్రబాబుతో శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నారాయణ


ముఖ్యమంత్రి దంపతులతో శ్రీవారి సేవలో మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 13: రాష్ట్ర మంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ పొంగూరు నారాయణ గురువారం తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులతోపాటు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ దంప తులతో కలిసి శ్రీవారి సేవలో నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవ దేవుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు చేయండి : ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 : ఈనెల 17న జరిగే బక్రీద్ పండుగకు బారాషహీద్ దర్గా, నెల్లూరు రూరల్‌లోని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయాలని, భక్తులకు సౌకర్యాలు కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీవో మాలోలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆయన బారాషహీద్ దర్గాను గురువారం సందర్శించారు. ప్రార్థనల అనంతరం మైనారిటీ నాయకులు, అధికారులతో సమీక్షించారు. తాను ఎమ్మెల్యే కాకముందు రూరల్ నియోజకవర్గంలో 141 రోజుల ఇంటింటి మహా పాదయాత్రను బక్రీద్ పర్వదినం రోజునే ప్రారంభించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఏసీ నగర్‌లో ఎన్టీఆర్ సెంటర్



బోర్డును ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూన్ 13 : నగరంలోని 14వ డివిజన్ ఏసీనగర్‌లో ఉన్న అల్లం టీ సెంటర్‌కు ఎన్టీఆర్ సెంటర్‌గా నామకరణం చేశారు. ఈ మేరకు బోర్డును, తెలుగుదేశం పార్టీ జెండాను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కోటంరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం ఎంతో కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పెట్టిన వైసీపీ నేతలకు ఐదింతలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎమ్మెల్యే నారాయణకు 2700 ఓట్లు, ఎంపీ వేమిరెడ్డికి 2458 ఓట్లు మెజారిటీ వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తానే మస్తాన్, పసుపులేటి మల్లికార్జున, సుభాన్‌బాషా, ఎల్లమందరెడ్డి, అంచూరు శ్రీనివాసులు నాయుడు, జానకి, ఆకుల హనుమంతరావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారంతో సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 13: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో గురువారం నగరంలోని ఆ పార్టీ నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కూరగాయల మార్కెట్ వద్ద నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి యువత సభ్యులు కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. యువత జిల్లా అధ్యక్షుడు మార్కెట్ సురేష్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, చిత్తూరు రాము, గణేష్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద జనసేన పార్టీ అభిమాని రావుల జస్వంత్ గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతు రాజు టోనీ బాబు, నాయకులు రహమతుల్లా, జిలానీ బాషా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న పవన్ కల్యాణ్ అభిమానులు

ఐసీడీఎస్‌లో బీసీజీ వ్యాక్సిన్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 : జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయంలో క్షయ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన బీసీజీ వ్యాక్సిన్‌ను గురువారం పంపిణీ చేశారు. 18 ఏళ్ల పైబడిన వయసు కలిగిన వారిలో షుగర్ వ్యాధితో బాధపడుతున్నవారికి ఈ టీకా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీజీ పరిశీలకుడు శశికాంత్, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వాకర్స్

నెల్లూరు (విద్య), జూన్ 13 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, దాత చింతల అమరేంద్రరెడ్డి, స్వర్ణరమేష్‌బాబు, కె.జయదేవ్, మేకల నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 : ముదివర్తిపాలెం గ్రామంలోని హైస్కూల్‌లో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీగణేష్ సేవా మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. రూ.5వేలు బహుమానం, ఇంటర్మీడియట్ కోర్సు కోసం నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సేవా ప్రియ వారి ఆధ్వర్యంలోనూ బహుమానాన్ని అందజేశారు. జీఎస్ఎం ఫౌండర్ గాలి శ్రీధర్, దండి సుమన్, దుద్దు అభిలాష్‌బాబు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామోజీ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు అని నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. గురువారం మాగుంట లే అవుట్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, వేదం సూర్యప్రకాష్, అరుణ, సందడి శ్రీమన్నారాయణ, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సొసైటీకి ముగ్గురు రాజీనామా

మనుబోలు, జూన్ 13: మనుబోలు ప్రాథమిక సహకార పరపతి సంఘం(సొసైటీ)కి గురువారం ముగ్గురు పదవులకు రాజీనామా చేశారని సొసైటీ సీఈవో చెంచుఓబులు తెలిపారు. 2022 నుంచి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న మడమనూరు గ్రామానికి చెందిన మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లుగా లక్ష్మీనరసింహపురంకు చెందిన రామసుబ్బానాయుడు, మనుబోలుకు చెందిన బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పని చేస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో తాము పదవులకు రాజీనామా చేస్తున్నట్లు సీఈవోకి అందజేసిన పత్రంలో వారు పేర్కొన్నారు.

కొనసాగుతున్న గజేంద్ర మోక్షం ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజేంద్రమోక్షం ఉత్సవాలు గురువారం ఆరో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా చేసిన గజేంద్రమోక్షం అలంకారం భక్తులకు కనువిందు చేసింది. సీతారామచంద్ర స్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు సంతకం జన సంబరం



2.71 లక్షలమందికి పెన్షన్ పెంపు

తిరుపతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చంద్రబాబు చేసిన ఐదు సంతకాలతో జిల్లా వ్యాప్తంగా లక్షలాదిమంది పేదలకు, వందలాది నిరుద్యోగ ఉపాధ్యాయులకు మేలు కలగనుంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 2.71 లక్షల మంది పేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్నారు. 2014కు మునుపు వీరికి నెలవారీ కేవలం రూ. 200 మాత్రమే పెన్షన్ వచ్చేది. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెన్షన్ మొత్తాన్ని ఒకేసారి రూ. వెయ్యికి పెంచారు. 2019లో దాన్నే రెండు వేలకు పెంచారు.జగన్ ప్రభుత్వం నాలుగేళ్ళలో ఏడాదికి రూ. 250 చొప్పున పెంచుతూ రూ. 3 వేలు చేసింది.కూటమి ప్రభుత్వం ఏర్పడితే నెలవారీ పెన్షన్ మొత్తాన్ని రూ. 3 వేల నుంచీ రూ. 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు గురువారం ముఖ్యమంత్రి హోదాలో తొలి సంతకం పెన్షన్ పెంపు ఫైల్‌పై చేశారు. దీనివల్ల జిల్లాలోని 2.71 లక్షలమంది పేదలకు నెలకు రూ. రూ. 27.41 కోట్లు, ఏడాదికి రూ. 325.77 కోట్ల చొప్పున అదనపు లబ్ధి కలగనుంది. రానున్న ఐదేళ్ళలో ఏకంగా రూ. 1628.86 కోట్ల అదనపు లబ్ధి కలగనుంది.వ్యక్తిగతంగా చూసినా ఒక్కో పెన్షనర్ ఏడాదికి రూ. 12 వేలు, ఐదేళ్ళలో రూ. 60 వేలు అదనంగా అందుకోనున్నారు.

మెగా డీఎస్సీతో భర్తీ కానున్న 600 టీచర్ పోస్టులు

చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు గురువారం మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారు. 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన రిక్రూట్‌మెంట్ తప్ప 2019-24 నడుమ వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికల ముంగిట కంటితుడుపుగా నోటిఫికేషన్ ఇచ్చినా పలు సాంకేతిక అభ్యంతరాల నడుమ హైకోర్టు ఆదేశాలతో భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. ఇపుడు చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి సాంకేతిక అవరోధాలు లేకుండా భర్తీ ప్రక్రియ చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ కానుండగా జిల్లాలో సుమారు 600 పోస్టులు భర్తీ కానున్నాయి. ఐదేళ్ళకు పైబడి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఇది తీపి కబురు.

నైపుణ్యాల గణనతో యువతకు మేలు!

నైపుణ్యాల గణన చేపట్టడం వల్ల జిల్లా యువతలో నైపుణ్యాలు కలిగిన వారు ఎందరు, లేని వారు ఎందరనేది తేలనుంది. దాన్ని బట్టి ప్రభుత్వం ఆయా కేటగిరీలకు చెందిన వారికి ఉపాధి కల్పించడానికి ఏమి చేయాలో ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. జీవనోపాధులకు నైపుణ్యాలు లేని వారికి ఆయా రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ట్రైనింగ్ ఇవ్వడం జరగనుంది. ఇప్పటికే నైపుణ్యాలు సాధించిన వారికి అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరగనున్నాయి. సీఎం చంద్రబాబు ఈ ఫైలుపై కూడా సంతకం చేయడంతో జిల్లాలో నిరుద్యోగ యువతకు మేలు కలగనుంది.

అభాగ్యుల కోసం మళ్లీ అన్న క్యాంటీన్లు



పట్టణాలు, నగరాల్లో నిరుపేదలు, వలస కూలీలు, పేద విద్యార్థులకు అన్నపూర్ణగా మారిన అన్నా క్యాంటీన్లు జిల్లాలో తిరిగి తెరుచుకోనున్నాయి. 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీయార్ పేరిట అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మున్సిపల్ పట్టణాలు, నగరాల్లోని ప్రధాన కూడళ్ళ వద్ద ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్లు నిరుపేదల కడుపు నింపాయి. కేవలం ఐదు రూపాయలకే కడుపు నిండా టిఫిన్, భోజనం లభించేది. ముఖ్యంగా చదువుల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచీ పట్టణాలు, నగరాలకు వచ్చే పేద విద్యార్థులు ఇక్కడ కడుపు నింపుకుని చదువులు కొనసాగించేవారు. అలాగే నిర్మాణ పనులకు, ఇతరత్రా పనులకు వచ్చే వలస కూలీలకు కూడా అతి తక్కువ ఖర్చుతో ఆకలి తీరేది. ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు కూడా అన్నా క్యాంటీన్లు కారు చౌకగా ఆహారాన్నందించేవి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, మదనపల్లె, పలమనేరు, పుంగనూరు తదితర చోట్ల 17 క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే రాజకీయ కక్షసాధింపు చర్యగా ఈ క్యాంటీన్లను మూసివేసింది. తాజా ఎన్నికల్లో వీటిని తిరిగి తెరుస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు గురువారం సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. దీంతో తిరుపతి జిల్లాలోనే తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరిల్లో అన్నా క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు, లాయర్లకు ఊరట

వైసీపీ ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ భూముల యజమానులను, రైతులను తీవ్రంగా భయపెట్టిన సంగతి తెలిసిందే. దానికి తోడు భూ వివాదాలపై కోర్టులను ఆశ్రయించే అవకాశం కూడా ఈ చట్టంలో లేకపోవడంతో న్యాయవాదులు కూడా ఆందోళనలకు దిగిన సంగతి తెలియంది కాదు. తాజా ఎన్నికల్లో కూటమి పార్టీలకు ప్రధాన ప్రచారాస్త్రంగా మారిన ఈ చట్టాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. చెప్పిన మాట ప్రకారం గురువారం చంద్రబాబు ఈ చట్టాన్ని రద్దు చేస్తూ ఫైలుపై సంతకం చేయడం భూముల యజమానులకు, రైతులకు, న్యాయవాదులకు ఊరటనిచ్చింది.

శ్రీవారి ఆశీస్సులతోనే ఎదిగా

తిరుమల వెంకన్న ఆశీస్సులతో అంచెలంచెలుగా ఎదిగా. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో పాటు దేశ రాజకీయాల్లో కూడా మంచి పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నా.ఏ సంకల్పం తీసుకున్నా ఒక నిమిషం వేంకటేశ్వరస్వామిని తలుచుకుని ముందుకు వెళ్లడం నాకు అలవాటు. చదువుకునే రోజుల్లో కూడా దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు మంగాపురం నుంచి కొండకు నడిచివచ్చేవాళ్లం.బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉపవాసముండి పూజల తర్వాత మధ్యాహ్నం భోంచేసేవాళ్లం.




టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలు

ఈ ఐదేళ్లలో తిరుమలలో ప్రసాదాలు మొదలుకుని పరిశుభ్రత వరకూ తిలోదకాలు ఇచ్చేశారు.పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి.గంజాయి, అన్యమత ప్రచారం, లిక్కర్, నాన్‌వెజ్, ఇష్టానుసారం పైరవీలు చేసేందుకు కేంద్రంగా తిరుమలను మార్చేశారు.కక్షసాధింపు చర్యలు వుండకూడదు కానీ చెడ్డ వ్యక్తులను శిక్షించి మంచి వాళ్లను కాపాడుకోకపోతే దేవుడు కూడా సహకరించడు. తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రం.ఇక్కడ ఏడుకొండల వాడా వెంకట రమణా, ఓం నమో వేంకటేశాయా అనే భక్తుల నినాదాలు తప్ప మరొకటి వినిపించకుండా చూస్తాం. దేశమే కాదు... ప్రపంచం మొత్తం అభినందించేలా టీటీడీని తీర్చిదిద్దుతాం.

దటీజ్ చంద్రబాబు



రేణిగుంట, జూన్ 13: తిరుమల పర్యటన ముగించుకున్న చంద్రబాబు విజయవాడ వెళ్లేందుకు రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు.అక్కడ వేచి వున్న సామాన్య ప్రజలను గుర్తించి వాహనం దిగి గ్యాలరీల వద్దకు వెళ్లి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడే ఆ సమస్యలను చదివి పక్కనే ఉన్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.గతంలో ముఖ్యమంత్రిగా వున్న జగన్ విమానాశ్రయానికి ఎప్పుడు వచ్చినా లోపలకు ప్రత్యేక కాన్వాయ్‌లో వెళ్లిపోయేవారు.సమస్యలను విన్నవించేందుకు ఆశతో వచ్చిన ప్రజలకు నిరాశ మిగిల్చేవారు.



శ్రీకారి ఆలయంలో బాబు ధ్యానముద్ర

శ్రీవారి సేవలో సీఎం

తిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట తిరునామంతో గురువారం ఉదయం 8గంటలకు కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ ఎప్పటిలానే క్యూలైన్ ద్వారా మహద్వారం వద్దకు చేరుకున్న చంద్రబాబుకు శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల బృందం, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ధ్వజస్తంభాన్ని తాకి గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్న చంద్రబాబుకు శేషవస్త్రాన్ని సమర్పించారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు.జేఈవో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించిన సీఎం 8.55 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు.

జనాల్లో దూసుకుపోయిన చంద్రబాబు

సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శన అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి వాహనం వద్దకు చేరుకోవాలి. సెక్యూరిటీ అధికారులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ఆ మేరకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి భక్తులను గొల్లమండపం వెనుకభాగంలో కట్టడి చేశారు. అయితే ఆలయం వెలుపలకు వచ్చిన చంద్రబాబు అఖిలాండం వద్దకు వెళ్లాలని చెప్పడంతో గొల్లమండపం పక్కనే ఉన్న దారి గేట్లను తెరిచారు. అక్కడినుంచి చంద్రబాబు భారీ సంఖ్యలో ఉన్న జనాల మధ్యలోనే ముందుకు వెళ్లారు. ఎస్ఎస్‌జీ సెక్యూరిటీ కాన్వాయ్ వద్దనే ఉండిపోవడంతో సాధారణ సెక్యూరిటీ సిబ్బందితో సహాయంతో అఖిలాండం వద్దకు చేరుకున్నారు. పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. సీఎం జనాల మధ్యలో వెలుతున్న సమయంలో పోలీసు ఉన్నతాధికారుల్లో టెన్షన్ కనిపించింది.



శ్రీవారి ఆలయంలోకి క్యూలైన్లో వెళుతున్న చంద్రబాబు



శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో, ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రముఖులతో బాబు

ముందుండి నడిపించండి

రాజకీయ ముసుగులో నేరాలు చేయాలంటే ఇక కుదరదు.ఎర్రచందనం స్మగ్లరుకు ఏకంగా ఎమ్మెల్యే సీటు ఇచ్చే ధైర్యం చేశారంటే వ్యవస్థను ఎంత పాడు చేశారో తెలుస్తోంది. చాలా ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది. శ్రీవారి సాక్షిగా చెబుతున్నా.మంచిని ప్రోత్సహిస్తా. చెడును తుంగలో తొక్కేస్తా.మేమొస్తే న్యాయం జరుగుతుందని ప్రతి ఒక్కరూ నమ్మకం పెట్టుకున్నారు.ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. గడిచిన ఐదేళ్లలో జరిగిన నష్టంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. తిరిగి పునర్నిర్మించుకోవాల్సిన అవసరముంది. ఆ శక్తిని దేవుడు టీడీపీకి ఇచ్చాడు. ప్రజలు కూడా ఓట్లు వేశాం పనైపోయింది అనుకోకుండా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నా.

వడివడిగా బడికి

- తొలిరోజు 72 శాతం విద్యార్థుల హాజరు
- ఉపాధ్యాయుల హాజరు శాతం 98.02



తిరుపతి(విద్య), జూన్ 13: పాఠశాలలు మళ్లీ తెరుచుకున్నాయి. ఉదయమే నిద్దురలేచి.. స్నానపానాదులు పూర్తిచేసుకుని.. పుస్తకాల బ్యాగులు వీపునకు తగిలించుకుని.. కారియర్లు చేతబట్టి వడివడిగా బడికి చేరే ఉరుకుల పరుగుల జీవనం మళ్లీ ప్రారంభమైంది. ఈ దృశ్యాలే జిల్లావ్యాప్తంగా గురువారం కనిపించాయి. పెద్దలతో వాహనాలపై, ఆటోల్లోనూ, స్కూలు బస్సుల్లోనూ విద్యార్థులు పాఠశాలలకు తరలివచ్చారు. దాంతో తిరుపతి, ఇతర నగర, పట్టణ ప్రాంతాల్లో ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలోనూ, సాయంత్రం ఇళ్లకు వచ్చే సమయంలో రోడ్లపై రద్దీ పెరిగింది.

72 శాతం హాజరు

జిల్లాలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలతోపాటు 2334 ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. ఇందులో 1,817 ప్రాథమిక, 194 ప్రాథమికోన్నత, 323 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,48,776 విద్యార్థులు ఉండగా వీరిలో 75,130 మంది బాలికలు, 73,646 మంది బాలురు ఉన్నారు. వీరందరిలో తొలిరోజు 72 శాతం మంది విద్యార్థులు బడులకు వచ్చారు. అలాగే 98.02 శాతం మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

70 శాతం స్టూడెంట్ కిట్లు పాఠశాలలకు

తొలిరోజు సాయంత్రానికి సుమారు 70 శాతం స్టూడెంట్ కిట్లు మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరుకున్నట్టు విద్యాశాఖాధికారులు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అణుగుణంగా 1,48,776 బ్యాగులు, యూనిఫారాలు, బూట్లు, 8,61,642 నోటు పుస్తకాలు, 1,06,958 బెల్టులు, 29,527 డిక్షనరీలు, 12,87,775 ఎన్.టి బుక్స్ జిల్లాకు చేరాయి. ఎంఈవోలు దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు. కిట్లు, నోటు పుస్తకాలను పాఠశాలలకు చేరవేశారు. ఐతే వీటిలో బ్యాగులు ఇప్పటి వరకు కేవలం నాలుగు మండలాలకే పూర్తిస్థాయిలో పంపిణీ జరిగింది. 30 మండలాలకు సరఫరా కాలేదు. బూట్లు ఇప్పటి వరకు 30 మండలాలకు పూర్తిస్థాయిలో సరఫరాకాగా మరో నాలుగు మండలాలకు పంపిణీ జరగాల్సిఉంది. శుక్రవారం నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు ఇవ్వనున్నారు. స్టూడెంట్ కిట్లను నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ద్వారా విద్యార్థులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన కార్యక్రమంగా ఎకో క్లబ్ పేరిట పిల్లలతో మొక్కలు నాటించడం, పర్యావరణ పరిరక్షణ, నీటి ఆదా గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాలిసెట్ అడ్మిషన్లు ప్రారంభం

- నేటినుంచి తరగతులు

తిరుపతి(విద్య), జూన్ 13: పాలిసెట్-2024 మొదటి ఫేజ్ అభ్యర్థులకు సీట్ అలాట్‌మెంట్ పూర్తయి, ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ముందుగా విద్యార్థులు తమ వద్ద ఉన్న యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో https://appolycet.nic.in/Default.aspxలో లాగిన్ అవ్వాలి. తర్వాత అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాగే సెల్ఫ్ రిపోర్టింగ్ సిస్టమ్ ఆప్షన్ ద్వారా జాయినింగ్ అయితే అడ్మిషన్ నెంబరు వస్తుంది. ఆ తర్వాత జాయినింగ్ రిపోర్టును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ రెండు కాపీలను, గతంలో కౌన్సెలింగ్ రోజున సమర్పించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను తీసుకుని సీట్ అలాట్ అయిన కళాశాలలో ఫిజికల్‌గా హాజరై అడ్మిషన్ తీసుకోవాలి. ఈ సమయంలో ఎలాంటి ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాల్సిన అవసరం లేదు. ఈనెల 19వ తేదీలోపు ఇలా చేయని విద్యార్థుల సీట్ క్యాన్సిల్ అవుతుంది. కాగా, విద్యార్థులకు తరగతులు మాత్రం శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

చంద్రబాబును కలిసిన ఎస్‌ఆర్‌ఎం ఛాన్సలర్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారివేందర్, సత్యనారాయణన్

మంగళగిరి, జూన్ 13: ఏపీ ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం ఛాన్సలర్, పార్లమెంటు మాజీ సభ్యుడు డాక్టర్ టీఆర్ పారివేందర్, వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పి.సత్యనారాయణన్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని నివాసంలో కలుసుకున్నారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తుందని, ప్రజల సంక్షేమానికి ప్రణాళికాబద్ధమైన పాలన అందించాలని పారివేందర్ ఆకాంక్షించారు. అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని సత్యనారాయణన్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు అమరావతి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

పాఠశాలలు ప్రారంభం



పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

గూడూరు, జూన్ 13: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. సెలవులలో సరదాగా గడిపిన విద్యార్థులు చదువులకు సిద్ధమయ్యారు. గూడూరు పట్టణ, మండలంలో 89 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 7,226 మందికి పైగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు అనుగుణంగా బోధనను అందించేందుకు సుమారు 30 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు రాలేదని సిబ్బంది పేర్కొన్నారు. పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి.

అభివృద్ధి పనులపై కార్యాచరణ



నాడు-నేడు పనుల వివరాలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు

వాకాడు, జూన్ 13: మండల అభివృద్ధి కార్యాచరణ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఏఎంసీ కార్యాలయం వేదికగా ప్రారంభిస్తున్నట్లు వాకాడు మండల టీడీపీ నాయకులు తీర్మానించారు. మండలంలోని స్వర్ణముఖినది గెస్ట్‌హౌస్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం టీడీపీ నాయకులు చర్చించారు. అనంతరం నాడు-నేడు పనుల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వాస్పత్రి, ఎస్‌ఎల్‌సీఈఎఫ్ పాఠశాల భవనాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. త్వరలోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, జనార్థన్‌రెడ్డి, తుమ్మల మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 13: వైద్యఖర్చుల నిమిత్తం గూడూరు పాన్‌బ్రోకర్స్, జ్యూవలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెంచురామయ్య గురువారం తెలిపారు. స్థానిక మసీదువీధికి చెందిన అలీఫ్ గత 35ఏళ్లుగా తమ అసోసియేషన్ గుమస్తాగా పనిచేస్తున్నారన్నారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్యఖర్చుల నిమిత్తం అసోయేషన్ తరుపున రూ.80వేలు ఆర్థికసాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సురేష్, భాస్కర్, సతీష్, ప్రసాద్, రాజేష్, సుజన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు ఎమ్మెల్యే పాశం అభినందనలు



మంత్రి రామనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 13: రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని గురువారం విజయవాడలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్లు పాశం తెలిపారు. కార్యక్రమంలో పాశం సంధ్యారాణి ఉన్నారు.

టీడీపీలోనే యువతకు భవిష్యత్తు

నాయుడుపేట/టౌన్, జూన్ 13: తెలుగుదేశంపార్టీలోని యువతకు భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. నాయుడుపేటలో గురువారం ఆయనను తెలుగు మహిళలు శాలువాలు కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సాఫ్ట్‌వేర్ రంగంలో ఆంధ్రాకు మంచి గుర్తింపు తెచ్చారని గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అనేక పరిశ్రమలను ఆంధ్రాకు రప్పించి యువతకు ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు పద్మ, కాంతమ్మ, అరుణ, సుభాషిణి, లలిత, జ్యోతి, సుమతి, రమణమ్మ, నిత్య కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, చరణ్ తదితరులు ఉన్నారు.



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న తెలుగు మహిళలు

రేషన్ బియ్యం వాహనంపై దాడి



పగిలిన ఎండీయూ వాహనం అద్దం

వాకాడు, జూన్ 13: మండలంలోని కొండూరు గ్రామంలో ఎండీయూ వాహనంపై ఓ వ్యక్తి చేతితో దాడి చేయడంతో అద్దం పగిలిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రేషన్ సరుకులను ఎందుకు ఇవ్వడం లేదని లబ్ధిదారుడైన ఎంబేటి సురేష్ గురువారం ఎండీయూ వాహన డ్రైవర్ హరిని ప్రశ్నించాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో లబ్ధిదారుడు సురేష్ చేతితో వ్యాన్ అద్దాలపై కొట్టడంతో పగిలిపోయాయి. జరిగిన ఘటనపై తహసీల్దారు నరసింహారావు సూచన మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అందని పరిహారం

- వేట సాగక.. పూట గడవక.. మత్స్యకార గ్రామాల్లో ఆకలికేకలు
- నేటితో ముగియనున్న చేపల వేట నిషేధం

కోట, జూన్ 13: కడలిని నమ్ముకొని జీవనం సాగించే గంగపుత్రులు 60 రోజులుగా ఆకలితో అలమటిస్తున్నారు. చేపలవేట నిషేధం అయిపోయినప్పటికీ నిషేధ పరిహారం పైసాకూడా అందకపోవడంతో అధికారులను శాపనార్థాలు పెడుతున్నారు. సముద్రతీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో 14 మత్స్యకార గ్రామాల్లో 1800 మంది మరబోట్‌లు కలిగి చేపలవేటకు వెళ్లే మత్స్యకారులు ఉన్నారు. వీరంతా చేపల వేటతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే దశ, పిల్లలు ఉత్పత్తి అయ్యే సమయంలో వాటికి ఎలాంటి భంగం కలిగించకుండా ఉండేందుకు మత్స్యశాఖ 61 రోజులపాటు చేపల వేటను నిషేధించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు ఆయా మండలాల్లోని మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా కఠినమైన ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి మత్స్యకారులు చేపల వేటకు విరామం పలికారు. చేపలవేట తప్ప ఏ ఇతర పనులు చేతకాని మత్స్యకారులు ఇళ్లకే పరిమితమైపోయారు.

వేట నిషేధ సమయంలో పరిహారం ఏదీ....?

సముద్రంలో చేపలవేట నిషేధించిన కాలంలో అర్హులైన గుర్తింపుపొందిన ప్రతి మత్స్యకార కుటుంబానికి గత ప్రభుత్వం రూ.10వేలను పరిహారంగా ప్రకటించింది. ఆ పరిహారాన్ని నిషేధ సమయంలోనే అందించాల్సి ఉండగా, గత ప్రభుత్వంకాని, మత్స్యశాఖ అధికారులు కానీ పట్టించుకున్న పాపానపోలేదు. పరిహారం కోసం మత్స్యకార కుటుంబాలన్నీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా కోట మండలం గోవిందపల్లిపాళెంలో మత్స్యకారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వీరి ఆకలికేకలు, ఆర్తనాదాల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో లబోదిబోమంటున్నారు.



వేట ఆగిపోవడంతో 60 రోజులుగా సముద్రపు ఒడ్డున ఉన్న బోట్‌లు

అధికారులకు ముందే చెప్పాం

మత్స్యకారుల పరిహారంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ఇక్కడ వాస్తవ పరిస్థితులను తెలియజేశాం. మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటాం. పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

\- రెడ్యానాయక్, ఎఫ్‌డీవో

ఆర్‌అండ్‌బీ రోడ్డును పట్టించుకోరా...!

- ప్రమాదం అంచున చెరువు కట్ట
- ఒకప్పటి జాతీయ రహదారి.. ఇప్పటి ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

ఓజిలి, జూన్ 13: ఇది ఒకప్పటి జాతీయ రహదారి... కోల్‌కత్తా-చెన్నైకి ఏ వాహనం ప్రయాణం చేయాలన్నా మార్గం ఇదే. 1991లో ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డు నుంచి నాయుడుపేట మండలం మల్లాం జంక్షన్ రోడ్డు వరకు జాతీయ రహదారికి బీజం పడింది. దీంతో ఓజిలి నుంచి పండ్లూరు మీదుగా నాయుడుపేటకు వెళ్లే ఈ జాతీయ రహదారి అప్పటి నుంచి ఆర్‌అండ్‌బీ రహదారిగా మారిపోయింది. ఈ మార్గం జాతీయ రహదారిగా ఉండే సమయంలో రోడ్డుకు తరచుగా మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖ అధికారులు చూసుకునేవారు. ఏటా మరమ్మతులతోపాటు జంగిల్ క్లియరెన్సు కూడా చేపట్టేవారు. గత ఐదేళ్లుగా అధికారులు ఈ రోడ్డుకు చేపట్టాల్సిన మరమ్మతులను పూర్తిగా విస్మరించారు. జంగిల్ క్లియరెన్సు కూడా చేపట్టకుండా కాలం వెళ్లదీశారు. ఈక్రమంలో ఓజిలి చెరువు కట్ట వద్ద ఈ రోడ్డు గత ఏడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపాను కారణంగా పూర్తిగా దెబ్బతింది. ఓజిలి చెరువు కట్ట వద్ద రాములయ్యమాను ప్రాంతంలో ఏకంగా చెరువు కట్టపై ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు కోతకు గురైంది. అధికారులు మట్టితో కప్పిపెట్టారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రోడ్డు చీలిపోయి ప్రమాదకరంగా ఉంది. మరోవైపు చెరువు కట్టకు పడమటి వైపు రోడ్డు తుపాను అలలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే చెరువు కట్ట నిలిచే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట ప్రారంభం నుంచి పండ్లూరు క్రాస్ రోడ్డు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు జంగిల్ క్లియరెన్సు చేపట్టక పోవడంతో ద్విచక్ర వాహన చోదకులు సైతం ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు ఈ రోడ్డుకు మర్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





రోడ్డును కప్పేస్తున్న ముళ్ల పొదలు

తుపాను అలలకు కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కేంద్రమంత్రిని కలిసిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు



సన్మానిస్తున్న మాధవ నాయుడు

సూళ్లూరుపేట, జూన్ 13: కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సూళ్లూరుపేటకు చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవ నాయుడు గురువారం అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, జూన్ 13: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీహాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి సీతారామ నాయుడు మాట్లాడుతూ తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద నేత్రాలయం సహకారంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణ, గౌరీశంకర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యాసామగ్రి అందజేత

తడ, జూన్ 13: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలంలోని 1 నుంచి 10వ తరగతి వరకు గల 49 పాఠశాలలకు ప్రభుత్వం అందజేసే విద్యాసామగ్రి విడతల వారీగా రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మార్సీ కేంద్రానికి వచ్చింది. అందులో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, టై, బూట్లు తదితరాలు ఉన్నాయి. బ్యాగులు మాత్రం రావాల్సి ఉంది. గురువారం ఎంఈవో మల్లికార్జునరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వాటిని అందజేశారు. పాఠశాల ప్రారంభం నాడే విద్యాసామగ్రిని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. 7వ తరగతి పాఠ్యపుస్తకాలు రెండు రోజుల్లో వస్తాయని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వెంకటగిరిటౌన్, జూన్ 13: వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞయాచేంద్రలు అన్నారు. గురువారం స్థానిక రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో కార్యకర్తలు ఆయన్ను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదన్నారు. మీకు అండగా ఉంటామని చెప్పారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటగిరిటౌన్, జూన్ 13: పట్టణంలోని రాపూరు క్రాస్ రోడ్డు, పాలకేంద్రం, క్రాస్‌రోడ్డు వద్ద ఎస్‌ఐ నాయక్, రమణయ్య తన సిబ్బందితో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ అనుమానస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. వాహనదారులు సరైన పత్రాలతో వాహనం నడిపేవిధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

డీఎస్సీతో ఉద్యోగ అవకాశాలు మెరుగు

గూడూరు, జూన్ 13: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేపట్టిన చంద్రబాబు రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు తొలి సంతకం పెట్టడం హర్షణీయమని ఏపీటీఎఫ్-1938 యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌కే బాబు గురువారం తెలిపారు. డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీకి చంద్రబాబు చర్యలు తీసుకోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేస్తామని నిరుద్యోగులను దగా చేసిందన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



సూళ్లూరుపేట, జూన్ 13: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి కదిలి వెళ్తున్న రైలును ఎక్కేందుకు ప్రయత్నించి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళ్తున్న లోకల్ మెము రైలు మూడో ఫ్లాట్‌ఫారంపై కదిలే సమయంలో ఎక్కేందుకు ప్రయత్నించి జారి పడిపోవడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. చేతులు కూడా నలిగి బలమైన గాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న క్షతగాత్రుడిని ప్రైవేట్ వాహనంలో వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఎరుపురంగు చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. సుమారు 35 సంవత్సరాలు పైబడి వయస్సు ఉంటుంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తకు పలువురి పరామర్శ

పెళ్లకూరు, జూన్ 13: మండలంలోని బంగారంపేట పంచాయతీ మోదుగులపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుంటపూడి గురవయ్య తల్లి గురవమ్మ (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న టీడీపీ శ్రేణులు గురవమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ పునబాక పోలయ్య, సర్పంచు గుంటపూడి పెంచలయ్య, డి.సుబ్రహ్మణ్యం, సూరి నాయుడు, రమణయ్య, చలపతి, ఏడుకొండలు, శివ, రఘురామయ్య, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13: ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను తిరుపతి క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 25 లక్షలు విలువ చేసే 400 గ్రాముల బంగారు నగలు, 2.25 కిలోల వెండి ఆభరణాలు, టీవీలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతూ లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రజలు సొత్తును అపహరిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో 11 ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఎస్పీ ఆదేశాలతో రెండ్రోజులుగా నిందితుల కోసం క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. క్రైం డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో ఇన్స్‌పెక్టర్లు కళా వెంకటరమణ, రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రవి, గోపీకృష్ణ, బసవరాజు రమేష్, శ్రీనివాస్, వినాయకం వేర్వేరు బృందాలుగా విడిపోయి గాలించారు. వేదిక్ యూనివర్సిటీ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారించగా నేరాలు బయటపడ్డాయి. దాంతో వీరిని తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా గూడళ్లూరు గ్రామానికి చెందిన మగేష్ మణికంఠ, పశ్చిమ గోదావరి జిల్లా తంగెళ్లమూడి గ్రామానికి చెందిన షేక్ ఆలీమొహిద్దీన్‌లుగా గుర్తించి, అరెస్టు చేశారు. మగేష్ మణికంటపై తిరుపతి, నారాయణవనం, రేణిగుంట, వెంకటగిరి ప్రాంతాల్లో 50 కేసులున్నాయి. షేక్ ఆలీమొహిద్దీన్‌పై 40 కేసులుండగా, నిడదవోలుస్టేషన్‌లో రౌడీషీట్ ఉందని డీఎస్పీ తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు

- ఎమ్మెల్యే విజయశ్రీ



ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట/టౌన్, జూన్ 13: సంక్షేమం... అభివృద్ధి తెలుగుదేశంపార్టీకి రెండు కళ్లు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలోగురువారం సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ-పార్థసారథి దంపతులను టీడీపీ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రాభివృద్ధి వెనక్కువెళ్లిందని, మరలా అభివృద్ధి జరగాలని ప్రజలు చంద్రబాబును ఆశీర్వదించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయి, జీవీఆర్ నాయుడు, మురళీ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, మాల్యాద్రి నాయుడు, నరసింహ నాయుడు తదితరులు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



చంద్రబాబుతో ఎన్‌ఆర్‌ఐ వెంకటతేజ, నాగేంద్రప్రసాద్‌రెడ్డి

పెళ్లకూరు, జూన్ 13: సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి టీడీపీ నేతలు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేశ్‌లను తిరుమలలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఎన్‌ఆర్‌ఐ పేరం వెంకటతేజ తదితరులు సీఎంను కలిసి దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేదల ఆకలి తీర్చనున్న అన్నక్యాంటీన్



టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అన్నాక్యాంటీన్ భవనం.. ప్రస్తుత సచివాలయ కార్యాలయం

గూడూరు, జూన్ 13: గత టీడీపీ ప్రభుత్వంలో పేదలందరూ మూడుపూటలా కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఇది నిత్య అన్నదానసత్రంలా కళకళలాడింది. ఎంతో మంది పేదలకు నామమాత్రపు నగదుతో కడుపులు నింపింది. వివిధ పనులపై పట్టణానికి వచ్చేవారికి, రెవెన్యూ, మండలపరిషత్, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు, సమీప ప్రాంతాలకు చెందిన కూలీలు పూటకు రూ.5లకే కడుపునిండా అన్నం తినేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని మూసివేశారు. అన్నక్యాంటీన్‌ను తొలగించిన భవనంలో వైసీపీ ప్రభుత్వం సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఎంతో మంది పేదల నోటి దగ్గర కూడును వైసీపీ ప్రభుత్వం లాగివేసిందని విమర్శలు వచ్చాయి. ఎన్నికల సమయంలో టీడీపీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తిరిగి పునఃప్రారంభిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన ఆయన గురువారం సీఎంగా తొలిసారి సచివాలయంలో బాధ్యతలు చేపట్టి అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించేలా ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో మళ్లీ పేదలకు కడుపునిండా నామమాత్రపు నగదుతో ఆకలి తీరనుంది. పేదలు హర్షం తెలుపుతున్నారు.

జీఎన్‌టీ రోడ్డుపై గుంతలు

- అదమరిస్తే అంతే



ఆర్టీసీ బస్టాండు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



జీఎన్‌టీ రోడ్డుపై ఎస్‌బీఐ వద్ద ఏర్పడిన పెద్దగుంత

సూళ్లూరుపేట, జూన్ 13: సూళ్లూరుపేట పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు గుంతలమయంగా మారింది. వినాయకుడి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రెండు గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు దెబ్బతిని అక్కడక్కడ రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. గత ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు ఈ గుంతలకు హడావిడిగా పైపైన పనులు చేశారు. ఇటు చెన్నైకు, అటు నెల్లూరుకు ఈ మార్గంలోనే రోజుకు వందలాది వాహనాలే కాకుండా పట్టణ వాసులు కూడా ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇకనైనా అధికారులు జీఎన్‌టీ రోడ్డు గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పద్మావతి అమ్మవారి సేవలో సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పులివర్తి నాని దంపతులు

తిరుచానూరు, జూన్ 13: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక తొలిసారిగా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం కుటుంబ సమేతంగా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దంపతులకు జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట వీరు ధ్వజస్తంభానికి నమస్కరించాక గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు ఆశీర్వచన మండపంలో వేదాశీర్వచనం చేసి.. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో సుమారు 20 నిమిషాలు గడిపారు. అనంతరం చంద్రబాబు ఆలయం వెలుపలకు బయటకు రాగానే భక్తులు, స్థానికులు సీఎం.. సీఎం అంటూ నినాదాలు నినాదాలు చేయడంతో వారిని వారించి ఆలయం వద్ద గోవిందనామస్మరణ చేయాలని.. అభివాదం చేసి బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు ఆలయం వద్ద సీఎం చంద్రబాబుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు స్వాగతం పలికారు. చంద్రబాబుతోపాటు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు. గతంలో వీవీఐపీలు దర్శనానికి వస్తే ఆలయం వద్ద దుకాణాలు మూసి పరదాలు కట్టి భక్తులకు ఇబ్బంది కల్గించేవారు. చంద్రబాబు రాక సందర్భంగా ఎలాంటి హడావుడి లేకుండా యథావిధిగా స్థానికులు, భక్తులు ఆలయ పరిసరాల్లో కలియదిరిగారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.